

నాడు: ప్రారంభం నాటి పోర్ట్ హాస్పిటల్ నార్త్ కైలాసపురం బస్ బే (ఫైల్)


నేడు: రూపురేఖలు కోల్పోయి శిథిలావస్థకు చేరిన పోర్ట్ హాస్పిటల్ బస్ బే


పోర్ట్ హాస్పిటల్ బస్ బేలో మాయమైన సీలింగ్ లైట్లు, వేలాడుతున్న విద్యుత్ వైర్లు

కళ తప్పిన బస్ బేలు


రక్షణ లేని విద్యుత్ మెయిన్ బోర్డు

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆధునిక హంగులతో నిర్మాణం
- వాటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసిన అధికారులు
- రూపురేఖలు కోల్పోతున్న బస్ షెల్టర్లు
- ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లు, బోర్డులు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక హంగులతో నిర్మించిన బస్ బేలు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో జీవీఎంసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆధునిక బస్ బేలు నిర్మించింది. నేడు అవి నిరాదరణకు గురై.. నిర్వహణ కరవై కళతప్పి రూపురేఖలు కోల్పోతున్నాయి. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో బస్టాపుల వద్ద నిలువ నీడనిచ్చే బస్ షెల్టర్లు లేవు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్ బేలను కనీసం కాపాడుకునే, నిర్వహించుకునే పరిస్థితి కూడా నేటి అధికారులకు లేకపోవడం దురదృష్టకరం.

మాయమైన లైట్లు.. వేలాడుతున్న వైర్లు

జాతీయ రహదారికి ఇరువైపులా అక్కయ్యపాలెం, పోర్టు హాస్పిటల్ వద్ద నిర్మించిన బస్ బేలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. అధికారులు వీటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో ఈ పరిస్థితి దాపురించింది. లక్షల రూపాయలతో అత్యాధునిక హంగులు, ఆధునిక లైటింగ్, ఎలివేషన్‌లతో నిర్మించిన ఈ బస్ షెల్టర్‌లు నేడు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయి. వీటిలో కొన్ని చోట్ల అందంగా నిర్మించిన ఎలివేషన్ టైటిల్స్, సీలింగ్ లైట్లు నేడు లేవు. వీటి విద్యుత్ వైర్లు గాలిలో వేలాడుతున్నాయి. వీటిలోని విద్యుత్ వైర్లు, లైట్లు చోరీలకు గురవుతున్నాయి. మెయిన్ బోర్డు, స్విచ్ బోర్డుల వద్ద కూడా ఏ విధమైన రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పొరపాటున ఎవరికైనా ఈ వైర్లు తగిలితే విద్యుత్ షాక్‌కు గురికాక తప్పదు.

పట్టించుకునే వారేరి..?

అక్కయ్యపాలెం బస్ బేలో పగలంతా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. గురుద్వారా బస్ బే వద్ద రహదారి గోతులతో నిండి అధ్వానంగా మారింది. ఈ బస్ షెల్టర్లను పట్టించుకునే నాథుడే లేడు. బస్ బేల పరిస్థితి దయనీయంగా మారడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి బస్ బేల నిర్వహణ వైపు దృష్టి సారించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


ఎలివేషన్ ఊడిపోయి కళావిహీనంగా దర్శనమిస్తున్న పోర్ట్ హాస్పిటల్ సౌత్ బస్ బే


సగం ఎలివేషన్ ఊడిపోయి అధ్వానంగా తయారైన అక్కయ్యపాలెం నార్త్ బస్ బే

క్లుప్తంగా

పీ-4 కార్యాలయం ప్రారంభం


కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, స్పెషల్ డీసీ ప్రవీణ

మద్దిపాలెం: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా 51వ వార్డు వుడా కాలనీలో పీ-4 కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర కార్యాచరణ ప్రణాళిక కార్యాలయం ద్వారా స్థానిక సమస్యలను సక్రమంగా పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. ప్రజలతో మమేకమై వార్డు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, జోనల్ కమిషనర్ బి.రాము, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, టీడీపీ నాయకులు సనపల వరప్రసాద్, సనపల కీర్తి, రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట


పందిరి రాట వేస్తున్న కర్రి రామారెడ్డి, చిర్ల సత్యనారాయణరెడ్డి, మహిళలు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ న్యూ శ్రీనివాసనగర్‌లో ఈ నెల 22 నుంచి జరగనున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం పందిరి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి, జిల్లా మేధావులు ఫోరం ప్రధాన కార్యదర్శి, న్యూశ్రీనివాసనగర్ గ్రామాధ్యక్షుడు చిర్ల సత్యనారాయణ రెడ్డి పాల్గొని స్థానిక మహిళల చేతుల మీదుగా పూజ చేసి పందిరి రాట వేశారు. దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తమ సహాయం పూర్తిగా ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రాయుడు రవి, గ్రీవెన్స్ సెల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పైలా అప్పారావు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

20న 'మనసు' లఘుచిత్రం ప్రీమియర్ షో


లఘుచిత్రం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు

సీతంపేట: పైడి శంకరరావు దర్శకత్వంలో రూపొందించిన మనసు లఘుచిత్రం ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శిస్తున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ కోరుకొండ రంగారావు తెలిపారు. సీతంపేటలో బుధవారం లఘు చిత్ర పోస్టర్లను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి కథతో నిర్మితమైన ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు పైడి శంకరరావు మాట్లాడుతూ మనసును హత్తుకునే కథాంశంతో లఘు చిత్రం నిర్మించామని, సినీ దర్శకుడు రెడ్డెం యాదకుమార్ పర్యవేక్షణలో రూపొందించిన ఈ చిత్రంలో హీరోగా సుదీప్ సాయి, హీరోయిన్‌గా నిరోషా అద్భుతంగా నటించారన్నారు. ఈ లఘుచిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు.

సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు


వానప్రస్థ వృద్ధాశ్రమంలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

మురళీనగర్: పట్టాభిరెడ్డితోట వానప్రస్థ వృద్ధాశ్రమంలో సీతారామచంద్రులకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని ఆశ్రమ నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు పూజా కార్యక్రమాల అనంతరం స్వామికి వివిధ సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే మహాలయ పక్షమందు పంచాగ్ని రుద్ర స్వరూపులైన పితృలకు శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తికి ఆత్మశాంతి కలగాలని ఉదకశాంతి, పితృతర్పణాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ వృద్ధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వారధి జిల్లా స్థాయి పోటీలు


వ్యాసరచన, డిబేట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్, ఎంసీహెచ్ స్కూల్‌లో బుధవారం వారధి జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ప్రతి మండలం నుంచి ఆయా పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మొత్తం 22 టీమ్‌లు జిల్లా స్థాయి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. డిబేట్‌లో నడుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సుహాని గీతికం గుల్షన్ ఫిర్దాస్, ఉజ్వల గెలుపొందారు. గైడ్‌గా ఎన్ఆర్ఆర్ఎస్ నరసింహం వ్యవహరించారు. వ్యాసరచనలో గాజువాక ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీవల్లి, తనూజ, సాయి పూజిత గెలిచారు. నిర్మల టీచర్ గైడ్‌గా వ్యవహరించారు. విజేతలకు పాఠశాల హెచ్ఎం రాధాకుమారి అధ్యక్షత జరిగిన ముగింపు సభలో ముఖ్య అతిథి సమగ్ర శిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్ చేతుల బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి విజేతలు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి పి.రాజారావు, ఏఎంవో జి.లక్ష్మి, జి.శ్రీదేవి, జ్యూరీ మెంబర్స్ శ్రీనివాసరావు, శ్యామల, టి.కిషోర్ వర్మ, ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ జీవన ప్రతిబింబం జానపద సాహిత్యం



ప్రసంగిస్తున్న కవి రెడ్డి రామకృష్ణ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'జానపద గేయాలు, సామాజిక అంశాలు' అనే అంశంపై కవి రెడ్డి రామకృష్ణ ప్రసంగించారు. జానపద గేయాల్లో ఆర్థిక, సామాజిక అంశాలు అనేకమున్నాయన్నారు. మహిళ, పురుష సంబంధాలు.. ముఖ్యంగా ఆస్తి సంబంధాల విషయంలో ఒకనాటి సమాజం ఎలా ఉండేదో చెబుతాయన్నారు. అద్భుతమైన సాహిత్య విలువలతో వచ్చిన జానపద గేయాలు, సాహిత్యం నేటికీ అవసరమేనని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఒకనాటి గ్రామీణ జీవనం, చరిత్రను తెలుసుకోవడానికి జానపద సాహిత్యం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిహెచ్. చిన సూర్యనారాయణ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, భాగవతుల సత్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, ఎం.పరమేశ్వరరావు, పిళ్లా శివాజీ, గుంటూరు సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

అంధకారంలో జాకీర్‌హుస్సేన్ నగర్

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి


జాకీర్‌హుస్సేన్ నగర్ వీధిలో స్థానికులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ లైట్లు

మద్దిపాలెం: స్థానిక జాకీర్‌హుస్సేన్ నగర్‌లో నెల రోజులుగా వీధిలైట్లు లేక అంధకారంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని సార్లు సచివాలయంలో ఫిర్యాదులు చేసినా, అధికారులతో చెప్పినా కనీస స్పందన లేదని, ఇంతవరకు లైట్లు ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. చివరికి స్థానికులు సొంతంగా వారి వారి ఇంటి ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి 11 వరకు వాటిని ఉంచి తర్వాత ఆపేస్తున్నామని, అలా చేయడం వల్ల విద్యుత్ బిల్లులు కూడా ఎక్కువగా వస్తున్నాయని వాపోతున్నారు. రాత్రి 11 గంటల తర్వాత అందరూ లైట్లు ఆపేయడంతో వీధుల్లో అంధకారం నెలకొంటుందని, ఆ సమయంలో ఎవరు వస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో తెలియక భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. ఇలా ఉంటే దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, గతంలో కూడా తమ ప్రాంతంలో బైకులు, పెట్రోల్ దొంగతనాలు జరిగాయని జాకీర్‌హుస్సేన్ నగర్ వాసులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ


ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు అందజేస్తున్న శ్యామలాదీపిక

మురళీనగర్: బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు పట్టాభిరెడ్డితోట వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు శ్యామలాదీపిక, సునీల్ అగర్వాల్ ఆశ్రమ వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శంకరరావు, ఒమ్మి నారాయణరావు, అరుణ్‌బాబు, పద్మజ, లోహిత్ రావు, కె.వెంకటరమణ, కూన వెంకటరావు, శంకరరావు, ప్రసాద్, వాసు, అరుణ, కల్యాణి, కృష్ణవేణి, మోసేసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛతా పక్షోత్సవాలు


డాల్ఫిన్‌నోస్ కాలనీలో స్వచ్ఛతా పక్షోత్సవాలు ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా, పాల్గొన్న అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా-2025 పక్షోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా వచ్చే నెల 2 వరకు 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలిరోజు డీఆర్ఎం లలిత్ బోహ్రా నాయకత్వంలో డాల్ఫిన్‌నోస్ కాలనీలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ప్రతి రోజు ఇంటింటికీ అవగాహన, ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లు, పోటీలు నిర్వహిస్తామని డీఆర్ఎం తెలిపారు. అక్టోబర్ 2 వరకు వర్క్‌షాప్‌లు, రైల్వే స్టేషన్లలో ఆరోగ్య శిబిరాలు, స్వచ్ఛతా ర్యాలీలు, వీధి నాటికల ద్వారా పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారం(ఇన్‌ఫ్రా), సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్, ఎన్విరాన్‌మెంట్ అండ్ హౌస్‌కీపింగ్ విభాగాధిపతి ప్రవీణ్ భటి, బ్రాంచి అధికారులు, రైల్వే అధికారులు, సిబ్బంది, కాలనీల వాసులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు


మహారాణి పార్లర్ వద్ద పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని మహారాణి పార్లర్ కూడలిలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ లీకవడంతో రెండు రోజులుగా మరమ్మతులు జరుగుతున్నాయి. దీని కోసం పెద్ద గొయ్యి తవ్వి మట్టి అంతా రోడ్డుపై కుప్పగా పోశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తి చేసి, గోతులు కప్పి రహదారిని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

కంచరపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని 56వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ యు.కార్తీక్ అన్నారు. రామ్మూర్తిపంతులుపేట హైస్కూల్‌లో బుధవారం 'స్వచ్ఛత పక్వాడా-2025'లో భాగంగా 'స్వచ్ఛత శపథం' కార్యక్రమం నిర్వహించారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం ప్రాథమిక పాఠశాల, గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో చెత్తాచెదారాలను తొలగించారు. ఆర్పీపేట హైస్కూల్ హెచ్ఎం ఎం.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో విద్యార్థుల ఆరోగ్యం బాగుటుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందిచే స్వచ్ఛత శపథంపై ప్రతిజ్ఞ చేయించారు. పక్షం రోజులు నిర్వహించే స్వచ్ఛతా పక్వాడాలో అందరూ భాగస్వాములు కావాలని హెచ్ఎం పిలుపునిచ్చారు. పరిశుభ్రత, నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణ, తరగతి గదుల శుభ్రత, వ్యాసరచన, కవితా రచన, స్వచ్ఛ, పాఠశాల గోడలపై స్వచ్ఛ భారత్ సందేశాల పెయింటింగ్స్, క్విజ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు, ఉపాధ్యాయులకు మెరిట్ అవార్డులు అందించనున్నట్లు ఆమె తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, విశాఖపట్నంలో

ఈ.పి. 31/2017 ఇన్ ఓ.ఎస్. 393/2013

బిట్వీన్
శ్రీ తేతలి రామారెడ్డి ...డీ.హెచ్.ఆర్.
అండ్
శ్రీ టంకసాల శేషగిరిరావు ...జే.డీ.ఆర్.

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పై కేసు నంబరు డిక్రీ అమలులో బాకీ రాబట్టే నిమిత్తము పైన ఉదహరించిన న్యాయస్థానంలో **తేది 06-10-2025దిన ఉదయం గం॥ 10.30 ని॥ల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యకాలంలో** కోర్టు వారు బహిరంగ వేలం వేయుదురు. కావున వేలంలో పాల్గొనదలచిన వారు ఆ సమయంలో వేలంలో పాల్గొనవచ్చని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

వేలం ఆస్తి వివరములు:

విశాఖపట్నం జిల్లా మహా విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, సీతమ్మపేట, రాజేంద్రనగర్, టౌన్ సర్వే నంబరు. 33/2, ప్లాట్ నంబరు 26లో, 395 చ॥గజములు స్థలములో నిర్మించబడిన శ్రీ లక్ష్మి రెసిడెన్సీ-2, డోరు నంబరు. 50-16-14, ఫ్లాట్ నెం. ఎస్-2 (1070 చ॥ అడుగుల) 35 చ॥ గజముల షేర్ కలిగివున్న ఫ్లాట్‌కు **హద్దులు : తూర్పు:** ఓపెన్ స్పేస్, **పడమర:** స్టెయిర్‌కేసు అండ్ లాబీ, **దక్షిణం:** ఓపెన్ స్పేస్, **ఉత్తరం:** ఓపెన్ స్పేస్.

విశాఖపట్నం జిల్లా మహా విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, సీతమ్మపేట, రాజేంద్రనగర్, టౌన్ సర్వే నంబరు. 33/2, ప్లాట్ నంబరు 26లో, 395 చ॥గజములు స్థలములో నిర్మించబడిన శ్రీ లక్ష్మి రెసిడెన్సీ-2కు **హద్దులు: తూర్పు:** ప్లాట్ నంబరు. 20, **పడమర:** 30 అడుగుల రోడ్డు, **దక్షిణం:** 30 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నంబరు. 25.

డీహెచ్ఆర్ విలువ: రూ. 10,00,000/- (పది లక్షల రూపాయలు మాత్రమే)
అమీనా విలువ: రూ. 20,00,000/- (ఇరువది లక్షల రూపాయలు మాత్రమే)
హియరింగ్ డేటు: తేది 06-10-2025ది

ఎస్.ఎస్.వి. రెడ్డి, అడ్వకేట్
వేణుమాధవి విల్లా, డోరు నెంబరు 49-36-47,
ఎన్.జి.జి.ఓస్ కాలనీ, అక్కయ్యపాలెం,
విశాఖపట్నం-530016. ఫోన్: 9393102036

కబడ్డీ పోటీల విజేత విశాఖ మహిళా కళాశాల


విజేత జట్టు సభ్యులతో ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణలో భాగంగా కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విజేతగా సీహెచ్ ఊర్మిలా అండ్ టీం నిలిచింది. రన్నరప్‌గా డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన సీహెచ్ భాగ్యశ్రీ అండ్ టీం గెలిచింది. మూడవ స్థానంలో చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వి.లావణ్య అండ్ టీం నిలిచింది. పోటీలు ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ పెంపొందుతుందన్నారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ కబడ్డీ వంటి సాంప్రదాయ ఆటలు మన సంస్కృతిని ప్రతిబింబించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్‌లో ఉన్నత స్థాయి పోటీలకు మార్గం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.